క్లుప్తంగా

తులసి సేవలు అభినందనీయం



ఆర్మూర్‌టౌన్: సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమని సీనియర్ సివిల్ జడ్జి నసీమ్ సుల్తానా అన్నారు. ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో పట్వారి తులసి, నసీమ్ సుల్తానాను మర్యాదపూర్వకంగా కలిసి 75వ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ స్వాతంత్ర్య అంశాల సేకరణ పుస్తకాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. స్వాతంత్ర్య సమయంలో జరిగిన అంశాలను నేటి సమాజంలో విద్యార్థులకు, యువతకు అవసరమయ్యే విధంగా పుస్తక రూపంలో పొందుపరచడం సంతోషకరమన్నారు. అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు.

పనుల్లో నాణ్యత ఉండాలి



వర్ని: అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని ఎక్కడైనా తేడా వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. జలాల్‌పూర్‌లో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పాఠశాల భవన నిర్మాణ పనులను, గ్రామీణ క్రీడా ప్రాంగణాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం అధికారుల నాణ్యత ప్రమాణాల మేరకు పనులు చేపట్టాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్ గౌడ్, తదితరులు ఉన్నారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి



రుద్రూర్: ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ పథకం పేదలకు వరం లాంటిదని చందూర్ సర్పంచ్ కర్లం సాయరెడ్డి అన్నారు. మంగళవారం చందూర్‌లో లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ప్యారం అశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



భీమ్‌గల్: మండలంలోని సికింద్రాపూర్, దేవన్‌పల్లి గ్రామాల లబ్ధిదారులకు జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి ఆధ్వర్యంలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చౌట్‌పల్లి రవి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, జెడ్పీ కో–ఆప్షన్ మోయిజ్ పాల్గొన్నారు.

దివ్యాంగుడికి చెక్కు అందజేత

మాక్లూర్: దివ్యాంగుల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును ఎంపీపీ మాస్త ప్రభాకర్ మంగళవారం లబ్ధిదారుడు మాదాపూర్ గ్రామానికి చెందిన సిరిపురం సాయిలుకు అందజేశారు. సాయిలు దివ్యాంగుల కోటా కింద కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో రుణం మంజూరు కావటంతో సంబంధిత చెక్కును ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయిలుకు అందజేశారు.

పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలి



ఆర్మూర్‌టౌన్: ప్రతిరోజు కార్మికులు పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత సూచించారు. ఆర్మూర్‌లోని 33 వార్డుల్లో కార్మికులు చేపడుతున్న పనులను పరిశీలించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కాలనీల్లో ఏవైనా సమస్యలుంటే తెలపాలన్నారు. ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

వర్ని: ఫిబ్రవరి నెల ఆఖరి వరకు పంచాయతీ పరిధిలో ఉన్న ఇంటి యజమానులు ఇంటి, కులాయి పన్నులు చెల్లించాలని సత్యనారాయణపురం పంచాయతీ కార్యదర్శి సాయిలు కోరారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు.

అసంపూర్తిగా ఉత్తర ద్వారం

- ఏడాది గడిచినా ముందుకు కదలని పనులు
- శ్రీరామ నవమి వరకు పూర్తి చేయాలని భక్తుల డిమాండ్
- పోచంపాడ్‌లో కోదండ రామాలయం పరిస్థితి



అసంపూర్తిగా కోదండ రామాలయ ఉత్తర ద్వారం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో పవిత్ర గోదావరి తీరాన ఉన్న కోదండ రామాలయం ఉత్తర ద్వారం పనులు ఏడాది గడిచినా అసంపూర్తిగానే ఉన్నాయి. ఉత్తర ద్వారం నిర్మాణం కోసం ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి రూ. 24.5 లక్షల నిధులను మంజూరు చేసింది. దీంతో 2021 డిసెంబర్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. ద్వారం నిర్మాణం పూర్తయినా సిమెంట్ ప్లాస్టరింగ్ పనులు మాత్రం చేపట్టలేదు. కొంత కాలం నుంచి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనులు నత్తనడక చేపట్టడం వల్ల గత జనవరి రెండున నిర్వహించాల్సిన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సిద్ధం కాలేదు. శ్రీరామనవమికి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. అప్పటి వరకైనా ఉత్తర ద్వారం నిర్మాణం పూర్తి చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయంలో అభివృద్ధి పనులు కూడా అసంపూర్తిగా ఉన్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర గోదావరి తీరాన ఉండటంతో గోదావరికి పుణ్య స్నానాలకు వచ్చే భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

కోదండ రామాలయంలో ఉత్తర ముఖ ద్వారం పనులు నిలిచిపోవడంపై ఉన్నతాధికారులకు నివేదించాం. పలుమార్లు కాంట్రాక్టర్‌ను కూడ పనులు వేగవంతం చేయాలని సూచించాం. ఉన్నత అధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం. – వేణు, ఈవో, దేవాదాయ శాఖ, పోచంపాడ్

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి భౌతిక రసాయన శాస్త్రంలో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలో మోడల్ స్కూలు చెందిన వేదశ్రీ ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన ఎండీ సయ్యద్ అహ్మద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఎంఈవో రాజ గంగారాం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం గంగారం, ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రతిభా పరీక్షలో జిల్లా స్థాయికి ఎంపిక

కమ్మర్‌పల్లి: జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షకు కమ్మర్‌పల్లి మండల విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన ఈ పరీక్షలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కమ్మర్‌పల్లి పాఠశాలకు చెందిన రిషిక మొదటి స్థానంలో నిలువగా, కోనాసముందర్ పాఠశాలకు చెందిన సాత్విక్ ద్వితీయ స్థానం, కమ్మర్‌పల్లికి చెందిన లక్ష్మణ్ మూడో స్థానంలో నిలిచారు. వీరు త్వరలో జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా పరీక్షలో పాల్గొంటారని ఎంఈవో ఆంద్రయ్య తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్కొండ, మెండోరా మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ ఫోరం నిజామాబాద్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెర్కిట్: బహుమతులు అందజేస్తున్న ఎంఈవో రాజ గంగారాం

పాదయాత్రను జయప్రదం చేయండి

వర్ని: పర్మినెంట్, స్పెషల్ స్టేటస్, వేతనాల పెంపు, మల్టీపర్పస్ విధానం రద్దు కోసం గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన పాదయాత్రను గ్రామ పంచాయతీ కార్మికులు జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) వర్ని మండల కన్వీనర్ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. వర్ని సీఐటీయూ కార్యాలయంలో పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్ర ఫిబ్రవరి 12న జనగామ జిల్లా పాలకుర్తిలో ప్రారంభమైందని తెలిపారు. 17 రోజులపాటు 300 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఫిబ్రవరి 28న మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

‘శాసనసభను బీఆర్‌ఎస్ కార్యాలయంగా మార్చారు’

వర్ని: శాసనసభను బీఆర్‌ఎస్ కార్యాలయంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ ఎద్దేవా చేశారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలో పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. కన్వీనర్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి మంత్రులతో అసత్యపు ప్రకటనలను సీఎం చేయిస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజల హితం కోసం పనిచేసే పీఎం నరేంద్ర మోదీపై సీఎం కేసీఆర్ మంత్రులు అసెంబ్లీ సాక్షిగా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. నియోజకవర్గ నాయకులు మాల్యాద్రి రెడ్డి, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ భూపాల్ రెడ్డి, మోస్రా మండల బీజేపీ అధ్యక్షులు స్వామి, చందూరు అధ్యక్షులు నీలి హరీష్ , జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేతలు మాల్యాద్రి రెడ్డి, కొత్తకొండ భాస్కర్

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన

రుద్రూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మోస్రా తహసీల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వండిన అన్నం ప్లేట్లను ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా సివిల్ సప్లై అధికారులు నాణ్యమైన బియ్యాన్ని సరాఫరా చేసి పేద పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, మధ్యాహ్న భోజన కార్మికులు అన్వరి, సవిత, సుజాత, చంద్రకళ, సావిత్రి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కంటి వెలుగును వినియోగించుకోవాలి

బాల్కొండ: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెండోరా మండలం దూదిగాం సర్పంచ్ సుజాత అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మి పాల్గొన్నారు.

మామిడిపల్లి 8వ వార్డులో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 8వ వార్డులో బుధవారం నుంచి నిర్వహించే కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోవింద్‌పేట్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస తెలిపారు. గ్రామంలోని వీడీసీ భవనంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21 వరకు శిబిరం కొనసాగుతుంది.

నవీపేట: మండలంలోని స్టేషన్ ఏరియాలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఉపసర్పంచ్ నరహరి హాజరై ప్రారంభించారు. కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



దూదిగాంలో ప్రారంభిస్తున్న సర్పంచ్ సుజాత

ఆరోగ్యాన్ని విస్మరించొద్దు

బోధన్ టౌన్/రెంజల్/రుద్రూర్/బాల్కొండ/ఆర్మూర్‌టౌన్ : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలలో ఆయుష్మాన్ భారత్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతీ నెల 14న జీవనశైలి వ్యాధులపై అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం, యోగా, నడక, మారథాన్‌లను ఆయా గ్రామాల్లో ప్రజలతో వైద్య సిబ్బంది చేయించారు. గర్భిణీలకు ప్రత్యేక యోగ చేయించి సూచనలు, సలహాలను అందించారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ కాలనీలో హెల్త్ ఫర్ సైకిల్ ర్యాలీని స్థానిక ఆర్డీవో రాజేశ్వర్, ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య కలిసి ప్రారంభించారు. ప్రతి నెలా 14న హెల్త్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. ప్రతీరోజు అరగంట పాటు సైకిల్ తొక్కడం ద్వారా మానసిక ఒత్తిడి దూరం అవుతుందని పేర్కొన్నారు.



బోధన్‌లో సైకిల్ తొక్కుతున్న ఆర్డీవో రాజేశ్వర్, ఎమ్మెల్యే సతీమణి అయేషా



నీలాలో.. స్థానికులు



కొత్తపల్లిలో.. ఎంపీడీవో దామోదర్, సర్పంచ్ విష్ణు



ఆర్మూర్ పట్టణంలో..



మోస్రాలో..



రుద్రూర్ మండల కేంద్రంలో..

పంట పొలాలకు దారి ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: యానం గుట్టవద్ద సుమారు 200 ఎకరాల సాగుభూమి ఉందని, తోళ్ల పరిశ్రమ నుంచి రైతులు వెళ్లడానికి దారి ఇవ్వాలని యూనివర్సల్ రైతు సొసైటీ సభ్యులు కోరారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయంలో మంగళవారం యూనివర్సల్ రైతు సొసైటీ సభ్యులు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ.. తోళ్ల పరిశ్రమ వద్ద కొంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని, దీంతో యానం గుట్ట సమీపంలో ఉన్న పంట భూములకు వెళ్లడానికి దారి లేకుండా పోతుందని వాపోయారు. అధికారులు కల్పించుకుని చర్యలు తీసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



రుద్రూర్: మోస్రా మండలం గోవూర్‌లో ఉపాధి హామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు జెడ్పీటీసీ విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరేందర్ రెడ్డి, మండల రైతు బంధు కన్వీనర్ పిట్ల శ్రీరాములు, వైస్ ఎంపీపీ కత్తి శంకర్, విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని మరవొద్దు

ఆర్మూర్‌టౌన్: ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న మన భారత సంస్కృతిని ఎప్పటికి మరవకూడదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో బీజేపీ నాయకులు ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలోని గోశాలలో గోవులకు సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి యువత పెడ ధోరణిని అవలంబిస్తూ, పాశ్చాత్య సంస్కృతిని అనుకరిస్తూ ఉన్నత భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. యువత భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



గోమాతకు సేవ చేస్తున్న బీజేపీ నాయకులు

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బోధన్‌లోని ఏకచక్రేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బోధన్‌టౌన్(బోధన్): మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ మహారాజ్, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ బ్రహ్మోత్సవాలు..

బాల్కొండ: మండల కేంద్రంలోని శ్రీ కృష్ణ మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మూడవ రోజు రుక్మిణీ కల్యాణం, అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగాణంలో జాతర నిర్వహించారు.



శ్రీకృష్ణ మందిరంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సంక్షిప్తం

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి

నవీపేట: బీజేపీ పటిష్టతకు కృషి చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. మంగళవారం బినోలాలో ప్రజా గోస -బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలకు ప్రచారం కల్పించాలని సూచించారు. బీజేపీ నేత వడ్డీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

‘యెండలను విమర్శిస్తే ఊరుకోబోం’

ఎడపల్లి(బోధన్): బీజేపీ నేత యెండల లక్ష్మీనారాయణ విమర్శిస్తే తాము ఊరుకోబోమని బీజేపీ పార్టీ శ్రేణులు స్పష్టం చేశారు. ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం నాయకులు రామరాజు మాట్లాడారు. ఎమ్మెల్యే షకీల్, యెండల లక్ష్మీనారాయణపై మాట్లాడిన మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం అయిన తరువాత రాత్రికి రాత్రే శివాజీ విగ్రహాన్ని పెట్టిన అనంతరం తమ పార్టీకి చెందిన మైనారిటీ కౌన్సిలర్లు, ముస్లింలను తీసుకువచ్చి గలాటా సృష్టించింది నిజమా కాదా అని ప్రశ్నించారు.

చందూర్ ప్రాథమిక పాఠశాలకు డెస్క్ బెంచీలు



రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు మన ఊరు- మనబడి పథకం ద్వారా మంగళవారం 75 డెస్క్ బెంచీలు సరఫరా చేశారు. 150 మంది విద్యార్థులు కూర్చోవడానికి సౌకర్యంగా ఉన్న బెంచీలను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన స్థానిక సర్పంచ్ కర్లం సాయరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో వసతులు మెరుగుపర్చడంతో కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోందని అన్నారు.

పుల్వామా వీర జవాన్లకు నివాళులు

రుద్రూర్: పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్‌లకు చందూర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు మంగళవారం రాత్రి నివాళులు అర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి వారిని స్మరించుకున్నారు. సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు.

కృష్ణవేణి హైస్కూల్లో..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని క్రిష్ణవేణి హైస్కూల్‌లో మంగళవారం పుల్వామా ఘటనలో అమరులైన సైనికులకు ఘన నివాళులర్పించారు. వీర సైనికుల చిత్రపటానికి పూల మాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లు

భీమ్‌గల్: బడా భీమ్‌గల్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపుపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికే ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మొత్తం 477 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా 87 మందిని ఎంపిక చేసినట్లు రెవెన్యూ అధికారులు గ్రామసభలో తెలిపారు.సర్పంచ్ సంజీవ్, ఆర్ఐ ధనుంజయ్ ఉన్నారు.